అన్ని రంగాల సంక్షేమానికి ఈ బడ్జెట్



- ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు

నవతెలంగాణ-లింగంపేట్

అన్ని రంగాల సంక్షేమానికి ఉపయోగపడేలా ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు అన్నారు. అసెంబ్లీలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం సహచర ఎమ్మెల్యేలతో ఎమ్మెల్యే లక్ష్మి కాంతరావు, ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డితో కలిసి మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమం ప్రవేశపెట్టారని తెలిపారు. తెలంగాణ వచ్చిన పదేళ్లలో నీటిపారుదల ప్రాజెక్టులు అని డబ్బులు తగలేశారని, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీటి సదుపాయాలు లేవన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడానికి కారణం గత పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఈ బడ్జెట్‌లో వైద్య, విద్య రంగాలకు నిధులు కేటాయింపు చేసినట్టు సూచించారు.

అందరికీ ఆమోదయోగ్యమైన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



నవతెలంగాణ-కామారెడ్డి

గురువారం ప్రవేశపెట్టిన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్ అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను సలహాదారుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ శాఖలకు తగిన ప్రాధాన్యం లభించేలా ప్రయత్నం చేశానని తెలిపారు. మైనార్టీ శాఖకు 3003 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి 33124కోట్లు, ఎస్టీ సంక్షేమానికి 17056 కోట్లు, బీసీ సంక్షేమానికి 9200 కోట్లు, రెండు లక్షల 91,159 కోట్లతో అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేసే విధంగా తెలంగాణ బడ్జెట్ ఉందని వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగానికి పెద్దపీట వేస్తూ 72,659 కోట్లు కేటాయించారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌లో మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని వివరించారు.



కాంగ్‌యాట్సే పర్వతాన్ని

అధిరోహించిన గురుకుల విద్యార్థి



నవతెలంగాణ-కామారెడ్డి

కృషి, పట్టుదల, అంకితభావం, కఠోరశ్రమ ఉంటే ఎంతటి అసాధ్యమైన సుసాధ్యం చేయవచ్చుననే మాటకు నిదర్శనం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న గిరిపుత్రుడు విస్లావత్ బన్నీ అని కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. కాంగ్‌యాట్సే పర్వతాన్ని అధిరోహించిన సందర్భంగా ప్రిన్సిపాల్ వివరాలు వెల్లడించారు.

'రాజంపేట్ మండలంలోని ఎల్లాపూర్ తండాకు చెందిన వ్యవసాయ కుటుంబంలో జన్మించిన బన్నీ సాహసమే తన శ్వాసగా చిన్న వయస్సు నుండే పర్వతారోహణపై అభిరుచిని పెంచుకున్నాడు. అతని ఉత్సాహాన్ని గమనించి గురుకుల కళాశాల ప్రోత్సాహంతో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) ద్వారా తన లక్ష్యానికి పునాది ఏర్పడింది. ఇటీవలి దేశంలోనే అత్యంత కఠినమైన పర్వతం రెండవ కాంగ్ యాట్సే పర్వతాన్ని అధిరోహించాడు. డైరెక్టర్ జనరల్ నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ డైరెక్టరేట్ ద్వారా కాంగ్ యాట్స్ పర్వతారోహణ కొరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంపిక చేయబడిన ఏకైక విద్యార్థి బన్నీ. గురుకుల విద్యార్థి భారతదేశంలోని లడఖ్ ప్రాంతంలో గల ఎత్తయిన శిఖరం (6250 కి.మీ) గల కాంగ్ యాట్స్ శిఖరాగ్రానికి చేరుకోవడానికి పది రోజుల పాటు కఠినమైన శిక్ష తీసుకొని, ఎన్నో సవాళ్లను ఎదుర్కొని, ఎన్నో అడ్డంకులు ఉన్నప్పటికి అచంచలమైన సంకల్పంతో పర్వతారోహణ పట్ల అభివృద్ధితో కాంగ్ యాట్సే శిఖరాగ్రానికి చేరుకొని, మార్గమధ్యంలో మంచు చీలికలు ఏర్పడిన మొక్కవోని దీక్షతో ముందుకు సాగాడు. కాంగ్ యాట్సే శిఖరాగ్రాన భారతీయ పతాకాన్ని రెపరెపలాడించి.. గురుకులం, ఎన్‌సీసి కీర్తి ప్రతిష్టలను దశదిశల వ్యాపింపచేశాడు. తన పర్వతారోహణ ప్రస్థానంలో చిన్న వయస్సులోనే గిరిజన గురుకుల విద్యార్థిగా ఆఫ్రికాలోని అత్యంత ఎత్తైన శిఖరం (5895కి. మీ) గల కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించి తన సత్తా చాటాడు. సిక్కింలో అత్యంత సాహసోపేతమైన ఎవరు అధిరోహించని (5282 కి. మీ)ల శిఖరాన్ని అధిరోహించి, ఆ శిఖరానికి "మౌంట్ అల్డ్"గా నామకరణం చేశాడు.' అని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరమైన (8848 కి.మీ) ఎవరెస్టు పర్వతాన్ని, నేపాల్‌లోని అత్యంత కష్టతరమైన (8091కి.మీ) అన్నపూర్ణ పర్వతాన్ని అధిరోహించడమే తన లక్ష్యంగా ధృఢసంకల్పంతో ముందుకు సాగుతూ మనందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడని తెలిపారు.

హోటళ్లు, సూపర్ మార్కెట్లు తనిఖీ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారి టి.సునీత, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎం.ఎ.ఖలీల్ పలు హెూటల్స్, సూపర్ మార్కెట్లను తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా పరిశుభ్రత సరిగా పాటించని వారికి నోటీసులు అందించినట్లు తెలిపారు. ఆహార పదార్థాల తయారీలో వాడుతున్న నిషేధించబడిన రంగులు, గడువు ముగిసిన ఉత్పత్తులను పారేసినట్టు ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారి పేర్కొన్నారు. ఇదేవిధంగా కొనసాగితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్టు ఆమె హెచ్చరించారు. ప్రతి ఆహార వ్యాపారస్తులు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. లేకుంటే వారికి భారీమొత్తంలో జరిమానా ఉంటుందని సూచించారు.



హోటల్‌లో కిచెన్‌ను పరిశీలిస్తున్న అధికారి

- ఎన్నికలకుముందు హామీనిచ్చినా.. అమలు చేయలే
- రాష్ట్ర బడ్జెట్‌పై పలువురి పెదవి విరుపు



నవతెలంగాణ-విలేకరుల బృందం

రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పలువురు పెదవి విరిచారు. ప్రధానంగా విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాటలేతప్పా.. చేతలు లేవన్నట్టుగా విద్యారంగం పట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగించిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని కాంగ్రెస్ స్పష్టంగా చెప్పిందని, ప్రస్తుత బడ్జెట్‌లో సగం కూడా కేటాయించలేదని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

విద్యరంగానికి ప్రాధాన్యత లేదు

హామీల కోసం బడ్జెట్ కేటాయించలేదు

- సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్



రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో నిధులను కేటాయించటంలో వివక్షత పాటించింది. ప్రధానంగా వితంతువులకు, వికలాంగులకు, వృద్ధులకు పెంచుతామన్న పెన్షన్లకు కేటాయింపులు జరగలేదు. మహిళలకు నెలకు రూ.2500 అందజేస్తామని చెప్పిన హామీకి కౌలు రైతులకు ఇస్తామన్న హామీ అమలులో ప్రభుత్వం విఫలమైంది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, ఉద్యోగులకు వేతనాలను పెంచటానికి గాని లేదా ఉపాధి అవకాశాలను కల్పించడానికి ఈ బడ్జెట్లో ఏ రకమైన నిధులు లేవు. నిజామాబాద్ జిల్లాలోని నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని చెప్పిన హామీ అమలు జరపటం హర్షించదగ్గ పరిణామం. కోపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీని కూడా తెరిపించాలి. అందుకు తగిన నిధులను కేటాయించాలి. జిల్లాలో పసుపు శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయటానికి నిధులను కేటాయించాలి.

విద్యపై ఆశల వ్యక్తీకరణ లేని రాష్ట్ర బడ్జెట్

- టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ అనిల్ కుమార్



నవతెలంగాణ-కామారెడ్డి

మాటలేతప్ప చేతలు లేవన్నట్టుగా విద్యారంగం పట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగించింది. 2,91,159 కోట్లలో 7.31 శాతం నిధులు కేటాయింపులు చేశారు. గత సంవత్సరం 6.56 శాతం కేటాయిస్తే, ఇప్పుడు 21,292 కోట్లు కేటాయించడం, విశ్వవిద్యాలయాలకు గత ప్రభుత్వం ఇచ్చిన విధంగానే 500 కోట్లు కేటాయించడం చూస్తే విద్య పట్ల ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగించనున్నదని తేటతెల్లమైంది. విద్యారంగంలో వినూత్న మార్పులు చేస్తామని, ఇంటర్నేషనల్ స్కూల్స్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నెలకొల్పుతామని తెలిపారు. కానీ అందుకు తగిన విధంగా బడ్జెట్ కేటాయింపులు చేయలేక గత ప్రభుత్వ బాటలోనే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగుతుంది. నిధుల కేటాయింపు పెంచకపోవడంతో విద్యను ప్రైవేటురంగానికి వదిలివేసే కుట్రగా భావించాల్సివస్తోంది.

అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన బడ్జెట్ ఏది?

- టిపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు

నవతెలంగాణ-కామారెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వం, అసెంబ్లీ ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని స్పష్టంగా చెప్పిందని, ప్రస్తుత బడ్జెట్‌లో సగం కూడా కేటాయించలేదు. నేటి ఆర్థిక మంత్రి బడ్జెట్లో 7.3 శాతం మాత్రమే కేటాయించడం ఆందోళన కలిగించే విషయం. వ్యవసాయ రంగానికి, సంక్షేమ రంగానికి ప్రాధాన్యత ఇచ్చినట్టే ఈ బడ్జెట్లో విద్యారంగానికి కూడా ఇచ్చి ఉంటే బాగుండేది.

మందుల ధరలు తగ్గించాలి..



- రీసెర్చ్ స్కాలర్ సోషల్ వర్కర్, నిజామాబాద్ దగ్గుల మధుసూదన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే ఆ రాష్ట్ర ప్రజలు ముందుగా ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరగాలి. అందుకు గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ అండ్ హెల్త్ విషయంలో 11,468 కోట్లు బడ్జెట్ ఇవ్వడం నిరాశ కలిగించింది. దీనికి తోడు కొన్ని ప్రత్యేక రాయితీలు కల్పించి ఉంటే బాగుండు. ముఖ్యంగా ప్రజలకు సీజనల్ వ్యాధులకు ప్రత్యేకంగా సదుపాయాలు, ఉచిత వైద్య పరీక్షలు అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలి.

విద్య, వైద్యం, వ్యవసాయరంగానికి ఇంకా కేటాయించాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



విద్య, వైద్యం, వ్యవసాయరంగానికి, కుటీర, చిన్న పరిశ్రమలకు ఇంకా బడ్జెట్ కేటాయిస్తే బాగుండేది. తెలంగాణ అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్లో కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యపై, ప్రభుత్వ ఆసుపత్రిలలో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు, వ్యవసాయరంగంలో పనిముట్లపై సబ్సిడీలు, తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక అభివృద్ధి మరింత ముందుకు పోయేందుకు కుటీర, చిన్న పరిశ్రమలకు నిధులు కేటాయించి ఉంటే బాగుండేది.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

- పిడిఎస్‌యు రాష్ట్ర కోశాధికారి జి.సురేష్

నవతెలంగాణ-కామారెడ్డి



రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు బట్టి విక్రమార్క విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులలో చాలా వివక్ష చూపారు. 7.31శాతం (21,292) కోట్లు అతి తక్కువ నిధులు కేటాయించి విద్యారంగానికి చాలా అన్యాయం చేశారు. గత పదేళ్లలో విద్యారంగానికి నిధులు తగ్గిస్తూ వచ్చారు. పదేళ్లలో విద్యారంగం మొత్తం నిర్వీర్యమైంది. గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే వివక్ష చూపుతోంది.

కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేయాలి

- సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి సైదుగౌని వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి



2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం, దళిత, గిరిజన, విద్యా వైద్య రంగాలకు కేటాయింపులను స్వాగతిస్తున్నాం. గత 10 సంవత్సరాలలో కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిగా ఖర్చు చేయలేదు. దళిత, గిరిజన ఉప ప్రణాళికలో ఏనాడూ 60 శాతానికి మించి వ్యయం చేయకపోవడం వల్ల ఆ వర్గాలు దారిద్ర్యం నుంచి బయటలేదు. అందువల్ల ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయాలని సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కమిటీ కోరుతున్నది. వ్యవసాయ రంగంలో రైతు రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమాతో పాటు, వ్యవసాయ పరిశోధనలకు రూ.72659 కోట్లు కేటాయింపులు చేశారు. విద్యా, వైద్యానికి చేసిన కేటాయింపులు గతంలాగే ఉన్నాయి. రాష్ట్రంలో అక్షరాస్యత 66 శాతం దాటడంలేదు. సాక్షరత మిషన్ లాంటి పథకాలను తొలగించడం, ప్రభుత్వ పాఠశాలలకు భవనాలు, ఇతర సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రయివేటు విద్యాలయాలకు ఆకర్షించబడుతున్నారు. వైద్యరంగానికి కేటాయించిన నిధులు కూడా బస్తీ దవాఖానాలకు, గ్రామ దవాఖానాలకు, ప్రభుత్వ ఆసుపత్రులకు సరిపోవు. విద్యా, వైద్య రంగంలో ప్రభుత్వాలు తగు శ్రద్ధ చూపకపోవడంవల్ల ప్రయివేటు రంగాలకు ఆకర్షించబడుతున్నారు. ఈ రెండు రంగాలకు కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉన్నది.

సరిపడా మందులు ఉచితంగా అందజేయాలి

- ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షకులు డాక్టర్ అబ్దుల్ ఫషి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హైపర్ టెన్షన్, డయాబెటిస్ రోగికి నెలకు సరిపడా మందులు ఉచితంగా అందజేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షకులు డాక్టర్ అబ్దుల్ ఫషి అన్నారు. గురువారం ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అసంక్రమిత వ్యాధులైన హైపర్‌టెన్షన్, డయాబెటిస్ క్యాన్సర్ వంటి వ్యాధులకు ప్రభుత్వం తరపున ఇస్తున్న చికిత్స గురించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్‌వాయి పరిధిలోగల 16 ఆరోగ్య ఉప కేంద్రాల ఆరోగ్య కార్యకర్తలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క హైపర్ టెన్షన్, డయాబెటిస్ రోగికి నెలకు సరిపడా మందులు ఉచితంగా అందజేయాలని, అందరికీ ప్రభుత్వం ద్వారా వచ్చే మందులు మాత్రమే వాడేలా చూడాలని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల మందులు ఎవరైనా వాడినట్లయితే వారికి ప్రభుత్వ మందులు వాడేవిధంగా ప్రోత్సహించాలని తెలిపారు. హైపర్ టెన్షన్ రోగులకు ఏ సమయంలో మందులు ఏ విధంగా వాడాలో ప్రొటోకాల్ ప్రకారం వాడేలా చూడాలని సూచించారు. డయాబెటిక్ ప్రొటోకాల్ కూడా పాటించాలని, నోటి క్యాన్సర్ రొమ్ము క్యాన్సర్ గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లయితే వారిని గుర్తించి ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. వారిని తదుపరి చికిత్సకోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి ఆపై పెద్ద ఆసుపత్రికి పంపించేలా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రతి నెల 30ఏళ్ళ పైబడిన వారందరికీ బీపీ పరీక్షలు, గ్లూకోజ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆన్లైన్లో నమోదు కార్యక్రమం తొందరగా పూర్తి చేయాలని, ఆరోగ్య కార్యకర్తలకు ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్‌వాయి పరిధిలోని గన్నారం ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించి అక్కడ అందుతున్న సేవలు గురించి ఆరా తీశారు. ప్రతి ఉప కేంద్రంలో అసంక్రమిత వ్యాధుల రిజిస్టర్ తప్పక ఉండాలని, మందుల స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలని తెలిపారు. ఉపకేంద్రాలలో జరుగుతున్న అసంక్రమిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రాజెక్టు అధికారి డాక్టర్ వినీత్, జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి, వైద్యాధికారి డాక్టర్ సంతోష్, అసంక్రమిత వ్యాధుల ట్రీట్మెంట్ సూపర్వైజర్ ఊహశ్రీ, జిల్లా అసంక్రమిత వ్యాధుల కోఆర్డినేటర్ వెంకటేష్, సురేష్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆనంద్ వెంకటరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షకులు డాక్టర్ అబ్దుల్ ఫషి

గురుకులాల్లో ఖాళీలకు స్పాట్ కౌన్సిలింగ్

నవతెలంగాణ-రామారెడ్డి

ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్, ఒకేషనల్ గ్రూపుల యందు మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలు నేడు ధర్మారం, బాలురలు, 27న భిక్కనూరు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఉదయం 9గంటలకు తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

రైతుల రుణాలు తీసుకున్న

గాయత్రి ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్

నవతెలంగాణ-కామారెడ్డి

బ్యాంకులో రైతుల పాస్‌బుక్‌పై రైతు పేరిట బ్యాంకులో రుణాలు తీసుకున్న గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతి రామ్ నాయక్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ రోజుల్లో ఎవరైనా బ్యాంక్‌లోన్ కావాలంటే బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రుణాలు బ్యాంక్ వాళ్లు ఇవ్వబోరని, బ్యాంకు అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యం కుమ్మక్కై పంట రుణాలు తీసుకోవటం ఇది దుర్మార్గమన్నారు. ఇటువంటిది జిల్లాలో అనేకంగా ఉన్నట్టుగా తమ దృష్టికి వస్తున్నాయన్నారు. ప్రస్తుతం గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ చెందిన 2500 మంది రైతులు ఉండగా అందులో నుంచి 400 మందికి మాత్రమే మెసేజ్‌లు వచ్చాయని తెలిపారు. సుమారుగా రూ.19కోట్ల వరకు మధ్యవర్తుల ద్వారా రైతుల పేరిట గాయత్రి యజమాన్యం రుణాలు తీసుకున్నట్లు తెలుస్తోందన్నారు. ప్రభుత్వ అధికారులు ఈ సంఘటనపై విచారణ జరిపి బాధ్యులైనటువంటి ఫ్యాక్టరీ యజమాన్యం, బ్యాంక్ అధికారులపై చట్టరీత్యా చర్యలు చేపట్టి ఏదైతే రుణాలు తీసుకున్నట్టు ఉన్నాయో రైతులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతు సంఘాలను, రైతులను ఏకం చేసి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో

ఐసీడీఎస్, అంగన్వాడీలకు నిధులు తగ్గించడం శోచనీయం

- అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సురేష్ గొండ

నవతెలంగాణ-పిట్లం/మద్నూర్/జుక్కల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఐసిడిఎస్ శాఖ, అంగన్వాడీలకు నిధులు తగ్గించి అన్యాయం జరిగినట్టు అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సురేష్ గొండ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆరోపించారు. 2024-25 కేంద్ర బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు 21వేల 200 కోట్లు కేటాయించి తీవ్ర అన్యాయం చేశారని పేర్కొన్నారు. గత 2023-24 సంవత్సర బడ్జెట్లో 21 వేల 523 కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఏకంగా 323 కోట్లు తగ్గించి బడ్జెట్ చూపించారని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కనీస వేతనాలు పెంచడం లేదని సూచించారు. కేంద్ర బడ్జెట్ గతం కంటే తగ్గించినందుకు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ ఛలో ఢిల్లీ కార్యక్రమంకు పిలుపు నివ్వడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత బడ్జెట్‌లో అంగన్వాడీల జీతాలు ఏ మాదిరిగా పెంచుతారో వివరించలేదని మండిపడ్డారు. బడ్జెట్ వాట దక్కే వరకు అంగన్వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.



బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోవాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్‌రాములు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బిజెపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్‌రాములు హెచ్చరించారు. ఉపాధి హామీ పనికి మొండి చేయి చూపిన బడ్జెట్‌ను నిరసిస్తూ నిజామాబాద్ నగరంలోని సుందరయ్య కాలనీలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా పెద్ది వెంకట్‌రాములు మాట్లాడుతూ.. గ్రామీణ పేదల ఆహార భద్రతకు, గ్రామీణ ఉపాధి హామీ పనికి బడ్జెట్లో నిధులు కేటాయించడంలో వివక్ష చూపిందని అన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ గ్రామీణ పేదలకు, రైతాంగానికి రాయితీలను కుదించి బడా కార్పొరేట్లకు రాయితీలను ప్రకటించడం ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. ఆహార పదార్థాల ధరలు 3.5 శాతం నుండి 7.5 శాతంకు పెరిగాయన్న ప్రభుత్వం వాటిని నియంత్రణ చేయడానికి ఎలాంటి చర్యలు బడ్జెట్లో చేపట్టలేదని అన్నారు. పైగా తెల్ల రేషన్ కార్డు దారులకు ఇచ్చే ఆహార సబ్సిడీ గత సంవత్సరం 2లక్షల 12 కోట్లు కేటాయించగా ఈసారి రెండు లక్షల ఐదు కోట్లకు తగ్గించడం అంటే ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వహణ బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పుకోబోతున్నదని అర్థం అవుతుందన్నారు. గ్రామీణ ఉపాధి పనికి కనీసం 2 లక్షల 40 వేల కోట్లు కేటాయించాలని మేధావులు కోరుతున్నా.. దానిని పట్టించుకోలేదని తెలిపారు. గత సంవత్సరం కేటాయించిన 86 వేల కోట్లను తిరిగి కేటాయించడం అంటే పని కోసం పెరుగుతున్న గ్రామీణ ప్రాంత వలసలను నివారించాలని చిత్త శుద్ధి ప్రభుత్వానికి లేదని స్పష్టమవుతుందని తెలిపారు. గ్రామీణ ఉపాధి పని దినాలను 200 రోజులకు పెంచి ఆంక్షలు లేకుండా రోజుకు 600 రూపాయలు కూలీ ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల పేదలకు పనిని విస్తరించాలన్న డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్లో మార్పులు చేసి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్లను అమలు చేయకుంటే భవిష్యత్తులో తీవ్రస్థాయి పోరాటాలను ఎదుర్కోవలసి వస్తుందని, అలాగే కేంద్ర బిజెపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సభ్యులు భీమాశంకర్, జిల్లా శంకర్, వసంత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి

పీఆర్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏర్గట్ల మండల పీఆర్టీయూ అధ్యక్షులుగా బి.కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గాండ్ల రాజశేఖర్, మండల అసోసియేట్ అధ్యక్షులుగా వి.పవన్ కుమార్, మహిళ ఉపాధ్యక్షురాలిగా మమత, కార్యదర్శిగా సి.హెచ్.సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు శేర్ల శ్రీనివాస్, జిల్లా గౌరవ అధ్యక్షులు ఇల్తెపు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల పర్యవేక్షణ



పనులను పరిశీలిస్తున్న ఎంపీవో

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షభావం దృష్ట్యా లోతట్టు ప్రాంతాలను ముప్కాల్ ఎంపీవో మహమ్మద్ గౌస్ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలను వహించారు. డ్రైనేజీల ద్వారా మురికి నీరు ఒకేచోట ఆగకుండా కాల్వల ద్వారా వెళ్లేలా చర్యలను తీసుకున్నారు. చెత్త చెదారంను శుభ్రపరిచేలా పనులను జీపీ కార్మికులతో చేయించారు. గ్రామస్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ సెక్రటరీలు ఎప్పటికప్పుడు సమయాను కూలంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీలు గౌతమి, రాజ్యలక్ష్మి, రాజు, కె.విఘ్నేష్, టీ.నగేష్ తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న సీనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గోపాల్‌ను తహసీల్దార్ గురువారం సన్మానించారు. గోపాల్ వేల్పూర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లడంతో తహసీల్దార్, సిబ్బంది కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మండల సర్వే ఆర్ రత్నాకర్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ జూనియర్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

శాంభవి హైస్కూల్ ఆధ్వర్యంలో బోనాల సంబరాలు



బోనాల సంబరాల్లో పాల్గొన్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని శాంభవి హై స్కూల్ ఆధ్వర్యంలో గురువారం బోనాల సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యార్థులతో కలిసి బోనాలు ఎత్తుకొని గ్రామంలోని పురవీధుల గుండా పోచమ్మ ఆలయానికి బోనాలతో చేరుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం, మొక్కులు సమర్పించారు. గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. బోనాల సందర్భంగా విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తులను ధరించి బోనాల సంప్రదాయ విశిష్టతను చాటారు. విద్యార్థులు పోతురాజు వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ బొట్ల విజయలక్ష్మి, చైర్మన్ బొట్ల మధుసూదన్ రాజు, కరస్పాండెంట్ బొట్ల రవీణ్ ప్రసాద్, ప్రిన్సిపాల్ బొట్ల ఇంద్రాణి, వైస్ ప్రిన్సిపాల్ బొట్ల మంజుల, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతుబీమా'కు 31 చివరి తేదీ

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యసాయాధికారి రాజ్ కుమార్ గురువారం రోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ఇటీవల కొత్తగా పాసుబుక్ పొందిన వారు 'రైతుబీమా' కోసం వచ్చే నెల ఆగష్టు 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్ తెలిపారు. అదేవిధంగా ఇది వరకే 'రైతుబీమా'లో నమోదై ఉండి వారి నామినీ చనిపోయినట్లయితే పేరును మార్చుకోవడానికి జులై 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే రైతులు అప్లికేషన్ ఫారం, రైతు పట్టాదార్ పాసుబుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ లను తీసుకొని స్థానిక ఏఈవోల వద్ద సరిచేసుకుని దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

చౌట్‌పల్లిలో దోమల నివారణ చర్యలు

- మురికి కాల్వలో ఆయిల్ బాల్స్ విడుదల



మురికి కాలువలో ఆయిల్ బాల్స్ వేస్తున్న జీపి పారిశుధ్య సిబ్బంది

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్ పల్లిలో గురువారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది గ్రామంలో వర్షం నీరు నిలిచిన గుంతల్లో, మురికి కాలువల వెంట దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమల లార్వాను చంపేందుకు, దోమల నివారణ కోసం నీటి మడుగులో ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గంగ జమున మాట్లాడుతూ నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం ద్వారా దోమల వృద్ధిని నివారించవచ్చని తెలిపారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులు రాకుండా ఉంటాయని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, రోజుల తరబడి నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అన్యాయం

టీయూలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో కేవలం విద్యారంగానికి 21,292 కోట్లు (7.31శాతం) మాత్రమే కేటాయించారని విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పిడిఎస్‌యూ తెలంగాణ యూనివర్సిటీ నాయకులు రవీందర్, అక్షయ్ అన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ముందు పిడి ఎస్ యు యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యారంగానికి కనీసం 15% నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని , కానీ బడ్జెట్లో విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించ కపోవడం సిగ్గుచేటని , ఇప్పటికైనా బడ్జెట్ సవరించి విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలని, యూనివర్సిటీలో వీసీ నియమకాలు చేపట్టాలని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో ఆకాష్, అర్జున్, మోహిత్,రాజ్ కుమార్, యశ్వంత్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని అమృత పూర్ గ్రామంలో గురు వారం మండల పరిషత్ ప్రాథమకోన్నత పాఠశాల లో బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయులు ఎ. కిషన్, ఎ. సురేష్, శోబారాణి, ఉమరాణి, నూతనంగా పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు ఎస్ రమాదేవి, యం రాజేశ్వర్,టి. సుజాత లను ప్రధానోపాధ్యాయులు ఎం.ఎల్ పవన్ కుమార్, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వారు చేసిన సేవలను కొనియాడారు.

బాల్య వివాహాలు చేస్తే లక్ష జరిమానా

- మూడు సంవత్సరాలు జైలు శిక్ష
- బాలికలపై లైంగికదాడులు చేస్తే ఉరిశిక్ష
- మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రక్షణ చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న మహిళ సంక్షేమ శాఖ జనరల్ స్పెషలిస్టు కవిత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బాల్య వివాహాలు చేస్తే లక్ష జరిమానా మూడు సంవత్సరాలు జైలు శిక్ష, మైనర్ బాలికలపై లైంగిక అత్యాచారంచేస్తే ఉరిశిక్ష విధించడం జరుగుతుందని మహిళ సంక్షేమ శాఖ జనరల్ స్పెషలిస్టు కవిత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో జక్రాన్ పల్లి మండల పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘాల సమైక్య లిమిటెడ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా మహిళా సాధికార కేంద్రం నుంచి లైల, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనరల్ స్పెషలిస్ట్ కవిత, పుష్ప అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మాయిలకు 18 సంవత్సరాల తర్వాత పెళ్లి చేయాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే లక్ష జరిమానా, మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారని అన్నారు. మైనర్ బాలికలపై లైంగిక దాడులచేస్తే ఫోక్స్ కింద కేసు నమోదు చేసి కొత్త చట్టాల ప్రకారం ఉరి శిక్ష విధిస్తారని తెలిపారు. బాల్య వివాహాలు నిర్వహిస్తే 1098 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. పనిచేసే ప్రదేశంలో అసభ్యకరంగా వ్యవహరించిన, వాట్సాప్‌లో చాటింగ్ చేసిన 2013 చట్టం కింద కేసు నమోదు చేస్తారని తెలిపారు. గృహహింస శారీరక హింస, మానసిక హింస, లైంగికంగా హింసించిన ఆర్థికంగా హింసించిన, లేదా వరకట్నం వేధిపులకు పాల్పడిన 498 కింద కేసు నమోదు చేస్తారని తెలిపారు. ఇటువంటి హింసలు చేస్తున్న తరుణంలో 181 నెంబర్‌కు కాల్ చేస్తే జిల్లాలోని సఖి కేంద్రానికి తీసుకెళ్తారని అన్నారు. సఖి కేంద్రానికి భర్తను కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తారని తెలిపారు. ఇంట్లో భార్య ఉండగా వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుంటే భర్త పైన 420 నెంబర్ చీటింగ్ కేస్ నమోదు చేస్తారని అన్నారు. మైనర్ బాలికల తల్లిదండ్రులు చనిపోతే మిషన్ వాత్సల్య పథకం కింద నెలకు 4000 రూపాయలు స్కాలర్‌షిప్ రెండు సంవత్సరాల వరకు ఇస్తారని తెలిపారు. స్కాలర్షిప్ కోసం ప్రభుత్వ పాఠశాలలో చదివే వారికి 18 సంవత్సరాల లోపు ఉన్న బాలికలు జిల్లాలోని బాల్య రక్ష భవనంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రోజుల్లో ఆడపిల్లల జాతి అంతరించిపోయే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం మగవారు వెయ్యి మంది ఉంటే ఆడవారు 950 మంది ఉండడంతో పెండ్లికోసం ఆడపిల్లలను వెతుకుతున్నారన్నారు. ఇద్దరు ఆడపిల్లలు పుట్టిన తర్వాత మూడవసారి స్కానింగ్‌చేసి ఆడపిల్లని తెలిస్తే గర్భంలోనే చంపేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు ప్రతినిధులు ఏపీఎం రవీందర్ రెడ్డి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మండల సమైక్య సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులకు స్మిత సబర్వాల్

బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, విహెచ్‌పీఎస్
- స్మిత సబర్వాల్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ వికలాంగుల శక్తిసామర్థ్యాల మీద చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, వికలాంగులకు స్మిత సబర్వాల్ బహిరంగ క్షమాపణ చెప్పాలని విహెచ్పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్, విహెచ్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ అధ్యక్షతన స్మిత సబర్వాల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విహెచ్పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ హాజరయ్యారు. ఈ సందర్భంగా విహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ మాట్లాడుతూ.. ఈ నెల 21న సోషల్ మీడియా వేదికగా సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ వికలాంగులకు సివిల్ సర్వీసెస్‌లో రిజర్వేషన్లు ఎందుకు అని సివిల్ సర్వీసెస్‌లో పనిచేసే వారు క్షేత్ర స్థాయిలో పని చేయగలరా.. అని, అలా పని చేసే శక్తి సామర్థ్యాలు వికలాంగులకు ఉండవు అని అనుచిత వాఖ్యలు చేసిందన్నారు. ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ మాట్లాడుతూ.. సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ వికలాంగుల సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే స్మిత సబర్వాల్ ని విధుల నుంచి తప్పించాలని, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సరికెల్ల పోశెట్టి మాదిగ, ఎంఎస్‌పి జాతీయ నాయకులు మానికొల్ల గంగాధర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లసింగారి భూమయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు రొడ్డ ప్రవీణ్ మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు యమున మాదిగ, సత్తెక్క మాదిగ, ఎంఎస్‌పి జిల్లా నాయకులు మంద ప్రభాకర్ మాదిగ, విహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ, విహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు బీరప్ప, ఎంఎంఎస్ జిల్లా నాయకురాలు పద్మ, సావిత్రి, లావణ్య, ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నాగం ప్రదీప్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ నిజామాబాద్ టౌన్ అధ్యక్షులు మహేష్ మాదిగ, విహెచ్పిఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, ఎంఎస్‌పి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వర్షంలోనూ పారిశుధ్య పనులు



పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలకుండా నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను సక్రమం చేయడానికి గురువారం ఎంపీఓ రాజ్‌కాంత్ రావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఇందల్వాయి మండలంలోని డొంకల్, గౌరారం, వెంగళ్ పాడ్, తదితర గ్రామాల్లో పారిశుధ్య కార్మికులతో నీరు నిల్వ ఉండకుండా పనులను చేపట్టినట్టు తెలిపారు. డ్రైనేజీలో కూరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

బాల్కొండ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో అధికారులు సందర్శించి పారిశుధ్య పనులు చేయించారు. బాల్కొండ, శ్రీరాంపూర్, చిట్టాపూర్ గ్రామాల్లో ఎంపీఓ గంగామోహన్ సందర్శించి పారిశుద్ధ పనులను పరిశీలించారు. అస్తవ్యస్తంగా రోడ్లపై గుంతల్లో, డ్రైనేజీలు నిండిపోయి నిలిచిపోయిన వర్షపు నీరును పంచాయతీ సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రజనీకాంత్, గణేష్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన పోలీసులు



మొక్క నాటిన మహిళా పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ ఆవరణంలో వనోత్సవం కార్యక్రమంలో భాగంగా 1వ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ విజయ్ బాబు ఆధ్వర్యంలో గురువారం పోలీసులు, సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ విజయ్ బాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అందులో భాగంగానే నాటిన మొక్కను పెంచాల్సిన బాధ్యత కూడా మన పైననే ఉందని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఒకటవ పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుళ్ళు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

- మండల పంచాయతీ అధికారి సదానంద్
- గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు



పనులను చేస్తున్న పారిశుధ్య కార్మికులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలను చేపట్టినట్లు మండల పంచాయతీ అధికారి సదానంద్ తెలిపారు. గురువారం హాస కొత్తూర్, చౌట్ పల్లి గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ జ్వరం, దోమల వల్ల వచ్చే వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో మురికి కాలువలను శుభ్రం చేయించడంతోపాటు, గ్రామంలో అన్ని వాటర్ ట్యాంక్ ల వద్ద బ్లీచింగ్ పౌడర్ చలిస్తున్నట్లు వివరించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇంట్లోని చెత్తను వీధిలో, మురికి కాలువలలో పాడేయకుండా ఇంటిలోనే తడి చెత్తను, పొడి చెత్తను వేరువేరుగా గ్రామపంచాయతీ ద్వారా అందించిన చెత్తబుట్టలో నిల్వ ఉంచుకొని గ్రామపంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులోనే వేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరసయ్య, గంగా జమున, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించటం సరికాదు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడం సరైంది కాదని, బడ్జెట్‌ను సవరించి నిధులు పెంచాలని పిడిఎస్‌యూ డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ విద్యారంగానికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ పేద మధ్యతరగతి విద్యార్థులకు చదువుకు దూరం చేయటమే ప్రభుత్వ ధ్యేయంగా ఉందని విమర్శించారు అంతేకాకుండా ప్రైవేటు పాఠశాలలకు బడా కార్పొరేట్ కాలేజీలకు ఊడిగం చేయటానికే ప్రభుత్వవిద్యపై చిన్న చూపు చూస్తుందని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి అధికారాన్ని కోల్పోయిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చింది కాని 21,292 కోట్లు, యూనివర్సిటీలకు 500 కోట్లు, మాత్రమే కేటాయించిందని తెలిపారు. విద్యారంగం బాగుపడాలంటే కనీసం బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పిందన్నారు. బడ్జెట్‌ను చూస్తే రేవంత్ రెడ్డి సర్కార్ కూడా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఇప్పటికే దాదాపు 8219.37కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు కనీస సదుపాయాలు లేక కునారిల్లుతున్నాయని అన్నారు. బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని, యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చెప్పడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కైఫ్, రహీబ్, నిశాంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన ప్రవీణ్ ఇటీవల కాలంలో బ్రెయిన్‌డెడ్‌తో మరణించగా.. కుటుంబ సభ్యులు ప్రవీణ్ అవయవదానం చేశారు. విషయం తెలుసుకున్న కంచర్ల గ్రామానికి చెందిన యువకులు రూ.10,500 కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న కంచర్ల గ్రామస్తులు

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, ప్రైమరీ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో చేపట్టిన పనులను ఎంపీడీవో శ్రీనివాస్, పిఆర్ఏఈ వినయ్ కుమార్ గురువారం పరిశీలించారు. ఆరు లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన పనులు చివరి దశకు రావడంతో మిగిలిన పనులను పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు. వారి వెంట పిఆర్టియు మండల అధ్యక్షులు సోమలింగం గౌడ్, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ బాబన్న తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దు

- అనవసరమైన చికిత్సలు చేస్తే కేసులు
- డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ప్రభు కిరణ్

నవతెలంగాణ-లింగంపేట్

రోగాల పేరుతో పేద ప్రజల ప్రాణాలతో చెలగాట మాడొద్దని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ప్రభు కిరణ్ ఆర్ఎంపీలకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పిఎంపీలకు, ఆర్ఎంపీలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆర్ఎంపీలు జ్వరంతో వస్తే అనవసరమైన చికిత్సలు చేసి వారి ప్రాణాలతో చెలగాటం ఆడొద్దన్నారు. వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు గ్రామాల్లో వస్తున్నప్పటికీ అలాంటివారు ప్రవేటు వైద్యుల వద్దకు వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు. మండల కేంద్రంలోని ల్యాబ్ నిర్వాహకులు వ్యాధి నిర్ధారణ చేయమని ల్యాబ్ దగ్గరికి వస్తే వారిని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలని ప్రభుత్వాసుపత్రిలోనే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డెంగ్యూ లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే ప్రభుత్వ వైద్యులకు సమాచారం అందించాలని అన్నారు. ఇప్పటికే గ్రామాలలో డెంగ్యూ లక్షణాలు కనబడితే వైద్య శిబిరాలు నిర్వహించి మెరుగైన వైద్య పరీక్షలు అందిస్తున్నామన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మారుమూల గిరిజన తండాల్లో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ల్యాబ్‌లో డెంగ్యూ నిర్ధారణ రక్త పరీక్షలు చేయాలని ల్యాబ్ నిర్వాహకులకు సూచించారు. సమావేశంలో జిల్లా మాస్ మీడియా ప్రతినిధి వేణు పద్మజ, మండల వైద్యాధికారి హిమబిందు, ఎంపీఓ మలహరి, సిహెచ్ఓ యాదగిరి, రమేష్, సుభాష్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆర్ఎంపీ డాక్టర్లు ల్యాబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ప్రభు కిరణ్

ఘనంగా కొచ్చెరి మైసమ్మ బోనాల జాతర


బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మండలంలోని మైలారం గ్రామ శివారులో వెలసిన కొచ్చెరి మైసమ్మ బోనాల పండుగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామంలో ఓ పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ మహిళలు బోనంతో వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. మైసమ్మకు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా బోనాల మహోత్సవాన్ని ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి బొట్టు, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మైలారం గ్రామం నుంచి గ్రామ శివారులో ఉన్న ఆలయం వరకు బోనాలతో ర్యాలీగా వెళ్లి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ డివిజన్ ఉపవైద్యాధికారిగా డాక్టర్ రాజు

నవతెలంగాణ-బోధన్

బోధన్ డివిజన్ ఉపవైద్యాధికారిగా డా.రాజు కామారెడ్డి నుంచి బదిలీపై బోధన్‌కు వచ్చారు. బోధన్ ఉపవైద్యాధికారిగా పనిచేసిన డాక్టర్ విద్య బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో అధికారులు కామారెడ్డిలో పనిచేస్తున్న డాక్టర్ రాజును బోధన్ ఉపవైద్యాధికారిగా నియమించారు. అలాగే సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రేఖ డిచ్‌పల్లికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సారంగాపూర్ జైల్లో వైద్యులుగా పనిచేస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్‌ను సాలూరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌గా నియమించారు. అలాగే సూపర్‌వైజర్ సునీత పోతంగల్ పిహెచ్‌సికి బదిలీ చేసినట్లు సమాచారం. ఏఎన్ఎం నంద కుమారి సాలూర హెల్త్ సబ్‌సెంటర్ నుండి బదిలీపై వెళ్లారు.

సీజనల్ వ్యాధుల పట్ల సమీక్ష సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వైద్యశాఖ అధికారులతో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశాన్ని ఎల్లారెడ్డి ఆర్‌డిఓ ప్రభాకర్ సమక్షంలో నిర్వహించినట్లు మండల ప్రత్యేక అధికారి, ఎంపీఓ ప్రకాష్ తెలిపారు. స్థానిక ప్రజలు వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల భారిన పడకుండా ఉండేందుకు చేపడుతున్న చర్యల గురించి తెలుసుకున్నారు. కాలనుగుణంగా వచ్చే వ్యాధులకు ప్రాథమికంగా అందించే సేవల గురించి ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామపంచాయతీల కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువును పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రం సమీపంలో అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువును మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ కౌన్సిలర్స్‌తో కలిసి మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. కామారెడ్డి పట్టణ ప్రజలు తాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని టెక్రియాల్ సమీపంలో గల పెద్ద చెరువును నీటి లభ్యత గురించి చర్చించారు. కామారెడ్డి పట్టణం రోజురోజుకూ విస్తరిస్తుండగా పట్టణవాసులకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ తెలిపారు. కామారెడ్డి పట్టణానికి తాగునీటి అవసరం కోసం అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువు నుంచి 30 శాతం మంచినీటి సప్లై కోసం ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. తాగునీటి అవసరం కోసం 30 శాతం నీటిని వినియోగించుకోవడం కోసం ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కామారెడ్డి పట్టణంలో మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రతిపాదనలు చేస్తునట్టు పేర్కొన్నారు. తాగునీటి అవసరం కోసం సత్వర ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, డిఈ సంతోష్, టీపిఓ గిరిధర్, కౌన్సిలర్లు పాత శివకృష్ణమూర్తి, లైబసుల్తానా సలీం, లడ్డు మొయినుద్దీన్, ఆస్మా అంజత్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

తెలంగాణ యూనివర్సిటీ ఫలితాల్లో సత్తాచాటిన పీజేఆర్ డిగ్రీ కళాశాల

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో విడుదల చేసిన రెండవ, నాలుగవ సెమీ ఫలితాలలో పిజేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి ప్రభంజనం సృష్టించారని కళాశాల చైర్మన్ గురువేందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీ ఫలితాలలో సెకండ్ సెమిలో తేజ బీకాం (సిఎ)9.72 జిపిఏతో పాటు నాలుగవ సెమిలో ఈ శ్రవణ్ కుమార్ బిజెడ్‌సిలో 9.72 జిపిఏతో యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకులు సాధించారన్నారు. వీరితోపాటు సెకండ్ సెమిలో డి.రమ్య ఎంపీసీలో 9.64 జిపిఏ సాధించిందని, ఇతర విద్యార్థులు 9.0 జిపిఏకి పైగా 50 మంది విద్యార్థులు జిపిఏ సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచి తమ కళాశాల పేరును రాష్ట్రస్థాయిలో నిలిపారన్నారు. ఈ సంవత్సరం మంచి ఫలితాలు సాధించినందుకు సంతోషంగా ఉందని విద్యార్థులకు కళాశాల తరఫున శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో పిజెఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.కృష్ణ, ప్రసాద్‌గౌడ్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.


సత్తాచాటిన విద్యార్థులు

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- తహసీల్దార్ లత


మాట్లాడుతున్న తహసీల్దార్ లత

నవతెలంగాణ-నసురుల్లాబాద్

వర్షాలపట్ల అప్రమత్తంగా ఉండాలని బీర్కూర్ తహసీల్దార్ లత మండల పరిధి అధికారులకు సిబ్బందికి ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లతా మాట్లాడుతూ గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల పట్ల అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బీర్కూర్ మండల పరిధిలో ఉన్న మంజీరా నది, వివిధ గ్రామాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని, వాగుల ప్రవాహ ఉధృతి దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తగా పాఠశాలలకు సెలవు కూడా ప్రకటించామని చెప్పారు. శిథిల భవనాలలో ఎవరూ ఉండవద్దని కోరారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆమె ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆహార సరఫరాకు ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. వీరి వెంట ఎంపీడీవో, సూపరింటెండెంట్ భానుప్రకాష్, వివిధ గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలపట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- తహసీల్దార్ వేణుగోపాల్


మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నవతెలంగాణ-పిట్లం

ఏడతెరిపి కురుస్తున్న వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ వేణుగోపాల్ అన్నారు. గురువారము మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాలలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాణహాని, ఆస్తినష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఆయా గ్రామాలలోని చెరువులు, కుంటలు ప్రవహించడం, నివాసపు ఇండ్లు కూలిపోవడం, అంటువ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు వాటి స్థితిగతులపై నిఘా పెట్టాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, ఎంపీఓ యాదగిరి, ఏఎస్ఐ లింబాద్రి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవళిక, పిఆర్ఏఈ మొగులయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దూపల్లి గ్రామంలో శానిటరీ పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి గ్రామంలో మురికి కాలువలను శుభ్రం చేస్తుండగా ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్ ఆ పనులను గురువారం పరిశీలించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామ కార్యదర్శి సలాంను ఆదేశించారు. మురికి కాలువ నుంచి తొలగించిన చెత్తాచెదారాన్ని వెంటనే డంపింగ్ యార్డ్‌కు తరలించాలని ఆయన సూచించారు. ప్రతిరోజు గ్రామంలోని పరిసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీలో రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రామ కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆయన పేర్కొన్నారు.

వర్షానికి కూలిన ఇండ్లు

- పరిశీలించిన అధికారులు


కూలిన ఇల్లును పరిశీలిస్తున్న అధికారులు


నవతెలంగాణ-లింగంపేట్

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాలలో నివాస ఇండ్లు కూలిపోయాయి. గురువారం మండలంలోని గాంధీనగర్‌లో ఇమాముద్దీన్ కరీంకు చెందిన ఇండ్లు పూర్తిగా కూలిపోయాయి. పోల్కంపేట్ గ్రామంలో ఒకరి ఇల్లు కూలిపోయింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా 5 ఇండ్లు కూలిపోయాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. గాంధీనగర్ గ్రామంలో రెండు ఇండ్లు కూలిపోవడంతో ఘటనా స్థలానికి ఎంపీఓ మలహరి, తాజా మాజీ సర్పంచ్ భీమ్‌రావు, కార్యదర్శి శ్రావణ్ కుమార్ చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వర్షం కారణంగా ఇల్లు నేలమట్టం కావడంతో ఎంతవరకు నష్టం వాటిల్లిందో బాధితులను అడిగి తెలుసుకున్నారు. పంచనామా నిర్వహించి మండల అధికారులకు అందజేస్తామన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు సంగమేశ్వర్, చింతామనుపల్లి గ్రామాల్లో పలు వార్డులను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమేష్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిచ్చి మొక్కలు తొలగించాలని, డ్రైయినేజీలలో చెత్త, నీటి నిల్వ లేకుండా చూడాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.


పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్

ప్రతీ రంగానికి న్యాయమైన బడ్జెట్ కేటాయింపులు

- జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు

నవతెలంగాణ-మద్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రతి రంగానికి న్యాయమైన ప్రగతిశీల బడ్జెట్ కేటాయింపులు చేపట్టిందని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గడిచిన 10 సంవత్సరాలు రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులో అన్యాయాలు చేశారని, కానీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క కేటాయించిన బడ్జెట్ అన్ని రంగాల వారికి న్యాయమైన విధంగా ఉన్నాయని తెలిపారు. విద్య వైద్యంతో పాటు వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు న్యాయమైన బడ్జెట్ అని తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చెరువులా మారిన పాఠశాల ప్రాంగణం


చెరువులా మారిన ప్రాంగణం

నవతెలంగాణ-బోధన్

గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ) పాఠశాల ప్రాంగణం, పాఠశాల ఎదురుగా ఉన్న క్రీడా ప్రాంగణంలో వర్షపు నీరుచేరి చెరువులా మారింది. దాంతో విద్యార్థులు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. కావున మున్సిపల్ అధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిలవకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రవహిస్తున్న బాగేపల్లి అలుగు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి చెరువు నిండుకుండలా నిండడంతో అలుగుద్వారా నీటి ప్రవాహం ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండడంతోపాటు అలుగు పారడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇక తమ పంట పొలాలు చేతికి వచ్చే అవకాశం నిండుగా కనబడుతున్నాయని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు చెరువులలో నీరు నిండుకోవడంతో జలకళ ఉట్టిపడుతోంది.



స్వచ్ఛభారత్ మిషన్‌పై గ్రామసభ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఎంపీవో రాము అధ్యక్షతన స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) ప్రత్యేక గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్బీఎం మోడల్ జీపీలైన హంగర్గ, కత్తల్‌వాడీ, బిజ్జల్‌వాడీ గ్రామ పంచాయతీలలో గ్రామసభ నిర్వహించి పలు అంశాలపై గ్రామస్తులకు, యువకులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గ్రామాలలో చెత్తచెదారం లేకుండా నిత్యం శుభ్రం చేయించాలని, గ్రామస్తుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి శానిటేషన్, దోమల నివారణ, అంటురోగాలు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హంగర్గ జీపీ కార్యదర్శి అశోక్‌గౌడ్, గ్రామస్తులు, యువకులు, మహిళ సంఘాల సభ్యులు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీవో రాము

రెంజల్ మండల కార్యదర్శులు వీరే

నవతెలంగాణ-రెంజల్

ఇటీవల కార్యదర్శుల బదిలీలు కావడంతో ప్రస్తుతం రెంజల్ మండలంలోని 17 గ్రామపంచాయతీలలో కార్యదర్శుల తమ బాధ్యతలను చేపట్టారు. కందకుర్తి ఇంచార్జ్ గ్రామ కార్యదర్శిగా సతీష్ చంద్ర, పేపర్‌మిల్ గ్రామ కార్యదర్శిగా రాజు, నీలా గ్రామ కార్యదర్శిగా సిహెచ్.సాయిలు, సాటాపూర్ గ్రామ కార్యదర్శిగా మహబూబ్ అలీ, బోర్గం కార్యదర్శిగా బి.రాణి, తాడ్‌బిలోలి గ్రామ కార్యదర్శిగా రాఘవేందర్‌గౌడ్, మౌలాలి తాండ కార్యదర్శిగా రజిని, బాగేపల్లి కార్యదర్శిగా శ్రీకాంత్, కూనేపల్లి కార్యదర్శిగా శివకృష్ణ, దూపల్లి కార్యదర్శిగా సలాం, కళ్యాపూర్ గ్రామ కార్యదర్శిగా నవీన్, వీరన్నగుట్ట గ్రామ కార్యదర్శిగా అర్చన, వీరన్నగుట్ట తాండ గ్రామ కార్యదర్శిగా వెంకటరమణ, కిసాన్ తండా గ్రామ కార్యదర్శిగా సాయిబాబా, రంజాన్ గ్రామ కార్యదర్శిగా రాజేందర్‌రావు, అంబేద్కర్‌నగర్ గ్రామ కార్యదర్శిగా సునీల్ యాదవ్, దండిగుట్ట గ్రామ కార్యదర్శిగా శిభ, నియమితులయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓగా రఫీ హైమద్, సీనియర్ అసిస్టెంట్‌గా అన్వర్ రఫిక్, జూనియర్ అసిస్టెంట్‌గా సతీష్, ఆఫీస్ సబార్డినెట్‌గా వీరేందర్ సింగ్ కొనసాగుతున్నారని ఎంపీడీవో హెచ్ శ్రీనివాస్ తెలిపారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన ఎంపీఓ చందర్

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని బస్సాపూర్, అడకాస్‌పల్లి గ్రామాలలో పారిశుధ్య పనులను ఎంపీఓ చందర్ గురువారం పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మురికి కాలువలు తీయకపోవడంతో రోడ్డుపైకి మురుగునీరు రావడంతో వెంటనే చర్యలు చేపట్టారు. గ్రామంలో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని సిబ్బందితో పేర్కొన్నారు. వారి వెంట కారోబార్ రజినీ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఎంపీఓ చందర్

వీధి కుక్కల బెడద

- నివారణ చర్యలు చేపట్టిన జిపి అధికారులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ ఎక్కువవడంతో.. నివారణ చర్యలకు గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్ కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు తీసుకున్న నిర్ణయాల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మద్నూర్ మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ అయినందున పెద్ద గ్రామంలో వాడవాడల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. దాంతో జీపీ అధికారులు కుక్కలను పట్టి వాహనాల్లో తరలించి ఇతర ప్రాంతాల్లో వదిలేసేందుకు చర్యలు చేపట్టారు.

భక్తులకు అవస్థలు

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ నగర శివారులోగల మాధవ్‌నగర్ సాయిబాబా దేవాలయంలో గురువారం దర్శనానికి వచ్చిన భక్తులకు బురద నీటి వల్ల ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటి వరకు రైల్వే లైన్ పనుల వల్ల ఇబ్బందులు పడ్డ ప్రజలు, ఇప్పుడు గుడి లోపల భాగంలో బురద నీరు నిలవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆలయ సిబ్బంది, దాతలు ముందుకు వచ్చి ప్రాంగణంలో సిసి నిర్మాణం చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.


బురదమయంగా మారిన రోడ్డు

పాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమం

నవతెలంగాణ-ఏర్గట్ల

కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం చేపట్టిన శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సాంస్కృతిక కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని పద్యాలు, పాటలు, చిత్రలేఖనం, నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, తెలుగు పండితులు ప్రవీణ్‌శర్మ, ఉపాధ్యాయులు ప్రవీణ్ శర్మ, గంగాధర్, మునీరోద్దీన్, రాజ నర్సయ్య, రాజేంధర్, పవన్, ప్రసాద్, శ్రీనివాస్, ఇందిరా, సమతా, జ్యోతి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

ఆరు దశాబ్దాల అద్భుతం

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 61 ఏళ్లు పూర్తి

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నేటితో 61 వసంతాలు పూర్తి చేసుకుంది. 1963 జూలై 26న అప్పటి భారత ప్రధాని దివంగత జవహర్ లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. నిజాం సర్కార్ హయాంలో 1949 మధ్యకాలంలో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. నిజాం సర్కారు పతనం కావడంతో పథకం అటకెక్కింది. అనంతర కాలంలో 1963 మార్చిలో అప్పటి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి పోచంపాడ్‌లో ప్రాజెక్టు నిర్మిస్తున్నట్లు ప్రకటన చేశారు.

ఎస్సారెస్పీ నిర్మాణం వెనక...

ఎస్సారెస్పీ నిర్మాణం వెనక 18 లక్షల ఎకరాలకు సాగునీరు, 36 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, చేపల పెంపకం ఆశయాలు ఉన్నాయి. 1091 (112 టీఎంసీల సామర్థ్యం). అడుగుల నీటిమట్టంతో 175 చదరపు మైళ్ళ విస్తీర్ణంతో గోదావరి జన్మస్థానానికి 326 మైళ్ళ దూరంలో సముద్ర మట్టానికి ప్లస్ 980 అడుగుల ఎత్తులో ప్రాజెక్టు నిర్మించారు. 42 వరద గేట్లు రిజర్వాయర్ నుంచి పూడిక వెళ్లేందుకు ఆరు రివర్స్ స్లూయిస్ గేట్లు నిర్మించారు.

1983 సంవత్సరం నుంచి వరదలు...



శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు 1963లో పనులు ప్రారంభమైన 1983 లో పూర్తయింది. అదే సంవత్సరం ప్రాజెక్టులోకి భారీ వరదలు వచ్చాయి. అప్పటినుంచి ఆయికట్టుకు నీరందిస్తున్నారు. ప్రాజెక్ట్ నుంచి 23 సార్లు గోదావరిలోకి నీటిని వదిలారు 1997, 2004, 2009, 2014, 2015 లో ప్రాజెక్టు నిండకపోవడంతో ఆయకట్టుకు నీరందించలేదు. ప్రాజెక్టు చరిత్రలో అతి స్వల్పానికి నీటిమట్టం పడిపోవడం కూడా 2015 లో జరిగింది. ప్రాజెక్టు ప్రధాన కాలువలు మూడు హై లెవెల్(లక్ష్మీ కాలువ), సౌత్ కాలువ (కాకతీయ కాలువ), నార్త్ కాలువ (సరస్వతి కాలువ)ను నిర్మించారు. పోచంపాడు గోదావరి నది తీరాన శ్రీ కోదండ రామాలయం ఉండడంతో 1978 నవంబర్ 5న ప్రాజెక్టుకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి పోచంపాడుకు శ్రీరాంసాగర్‌గా నామకరణం చేశారు. ప్రాజెక్ట్ కాలువలకు కాకతీయ, లక్ష్మి, సరస్వతి పేర్లు పెట్టారు. గత సంవత్సరం ప్రాజెక్టుకు 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం మూడవ పంపు వద్ద ఉత్సవాలు సైతం ప్రాజెక్టు అధికారులు నిర్వహించారు.

ఈప్రాజెక్టు ద్వారా ఇతర జిల్లాలకు సాగునీరు



నిజామాబాద్ జిల్లాలో ఉన్న పోచంపాడు ప్రాజెక్టు ద్వారా చుట్టుపక్కల జిల్లాల రైతాంగానికి నీరు అందించడం అభినందనీయం. ఈప్రాజెక్టు నిండితే పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. ఈ ప్రాజెక్టు జిల్లా రైతులకు వరం.

రుయ్యాడి రాజేశ్వర్, (సావెల్)
బిజెపి నాయకులు, న్యాయవాది, ఆర్మూర్.

ఏకరూప దుస్తులు పంపిణీ


విదార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న గ్రామ అభివృద్ధి కమిటీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏకరూప దూస్తువులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామఅభివృద్ధి కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రభాకర్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలను అందజేస్తామని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించే విధంగా చూడాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమమైన ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతుందని, లోటుపాట్లు ఉంటే గ్రామ అభివృద్ధి కమిటీ ముందుండి అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చింతల దాస్, పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు విజయ్, విడిసి ఉపాధ్యక్షులు మేకల శేఖర్, జరుగు రాజన్న, అన్నారం శేఖర్, బిరిష్ శెట్టి, గంగారం, కంజర ప్రసాద్, గాండ్ల సాగర్, కలిగోడు సతీష్, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఫోటోగ్రాఫర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన ఫోటోగ్రాఫర్స్ యూనియన్

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని ఫోటో గ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ సభ్యులు గురువారం సమావేశమై ఫోటోగ్రాఫర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు గా సింధుల రాజేందర్, ప్రధాన కార్యదర్శి గా గడ్డం హరీష్, కోశాధికారి గా మేక సాయినాథ్, ఉపాధ్యక్షుడు గా పొన్న రాకేష్, అదనపు కార్యదర్శి గా మేక నాగేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎన్నిక అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గంను పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐ మొహమ్మద్ యాసీర్ అరాఫత్

నవతెలంగాణ-బాల్కొండ

ఈ మధ్యకాలంలో వరుసగా తాళం వేసిన ఇండ్లల్లో దొంగతనాలు జరుగుతున్నందున బాల్కొండ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మొహమ్మద్ యాసీర్ అరాఫత్ తెలిపారు. ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్లేటప్పుడు ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదును పెట్టరాదని, తాళం వేసినప్పుడు ఇల్లు చీకటిగా ఉండకుండా ఇంటిలో ఖచ్చితంగా లైట్ ఆన్ చేసి వెళ్ళాలని అన్నారు. ఇంటికి తాళం వేసి వేరే గ్రామాలకు వెళ్లేటప్పుడు పక్కింటి వారికి తప్పకుండా సమాచారం ఇవ్వాలని కోరారు. పండగలకు వేరే ఊర్లకు వెళ్లేవారు తమ ఇంటికి తాళం వేసినట్లు కనబడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు మీ చుట్టుపక్కల కనబడినట్లయితే వెంటనే డయల్ 100కి లేదా బాల్కొండ ఎస్ఐ సెల్ నెంబర్ 87126 59860కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఐఐటి ఒలంపియాడ్ తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ శివారులోని గాంధీనగర్ లో గల ఆక్స్ఫర్డ్ పాఠశాలలో గురువారం ఐఐటీ ఒలంపియాడ్ తరగతులు ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఐటి నీట్ ఒలంపియాడ్ ఫౌండేషన్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో బట్టి విధానాన్ని మానిపించి, విషయ పరిజ్ఞానాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో ఐఐటీ, నీట్, ఒలంపియాడ్ శిక్షణ తరగతులు పాఠశాల స్థాయి నుండి అందించడం అవసరమని ఆయన అన్నారు .ఈ శిక్షణ తరగతుల వల్ల పాఠశాల స్థాయి నుండి విద్యార్థులకు ఆత్మస్థైర్యము పెరుగుతుందని, లాజికల్, రీజనింగ్ విషయాల్లో నిష్ణాతులుగా తయారవుతారని అన్నారు. మెట్రోపాలిటన్ పట్టణాల్లో అందించే విద్యను ఆక్స్ఫర్డ్ పాఠశాలలో అందించడం గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ ఐఐటి ఒలంపియాడ్ ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బుక్స్ పంపిణీ


విదార్థులకు బుక్స్ పంపీణీ చేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన మీనుగు లస్మన్న 11వ వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం కుమారులు గురువారం చేపూర్ హై స్కూల్ విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజ గంగారం, రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయురాలు చేతన కుమారి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.కె చిన్న రెడ్డి, వీడీసీ కోశాధికారి సురేష్ రుక్మాజీ, గౌడ సంఘం మండల అధ్యక్షుడు లింగం గౌడ్, శంకర్ దాస్, మాజీ ఎంపీటీసీ జన్నపల్లి గంగాధర్, చరణ్ , శాంతి కుమార్, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వర్షంలో ఉరుకులు.. పరుగులు..

- వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డెంగ్యూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, రోడ్లపై, మురికి కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకొవాలి జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ అన్నారు. గురువారం భారీ వర్షంలోను డిచ్ పల్లి మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ డిచ్ పల్లి, బర్ధీపూర్, ధర్మారం(బి) మేజర్ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులను ఆకస్మింగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ మాట్లాడుతూ.. డెంగ్యూ, సీజనల్ వ్యాధులు రాకుండా రోడ్లపై, మురికి కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకొవాలని సూచించారు. మురికినీరు నిల్వ ఉన్నచోట ఆయిల్‌బాల్స్ వేయాలని చెప్పారు. రోడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, చెత్తను డంపింగ్ యార్డుకు వెంటది వెంట తరలించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, మెజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావు, సురేంద్ర మోగుల్లురు తోపాటు పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

విద్యారంగానికి తీవ్ర అన్యాయం : పీడీఎస్‌యూ

- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో కేవలం విద్యారంగానికి 21,292 కోట్లు (7.31 శాతం)మాత్రమే కేటాయించారని విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినా బడ్జెట్లో విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు బలోపేతం చేయకపోతే పేద బడుగు బలహీన వర్గాలకు చదువు దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బడ్జెట్ సవరించి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, యూనివర్సిటీలో వీసీ నియమకాలు చేపట్టాలని, నగరంలో మహిళా డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలను నిర్మించాలని, సంక్షేమ హాస్టల్లో సౌకర్యాలు పెంచాలని సొంత భవనాల నిర్మించాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని , మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేష్, వరప్రసాద్, దేవదాస్, నాందేవ్, నితీష్, శ్రీకాంత్, ఆకాష్, వంశీ, రాహల్, సాయి తేజ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు .



నినాదాలు తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

రైతులకు క్షమాపణలు చెప్పాలి

- కాంగ్రెస్ జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

పసుపు బోర్డు ఏర్పాటుపై అదే విపక్ష జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు బేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వయంగా ప్రధాన మంత్రితో పసుపు బోర్డు ఏర్పాటుపై ప్రకటన చేయించిన జిల్లా ఎంపీ అరవింద్, ఎమ్మెల్యేలు రాకేష్‌రెడ్డి పసుపు బోర్డుకు నిధులు తీసుకురావడంలో విఫలం అయ్యారని తెలిపారు. మొన్నటి యూనియన్ బడ్జెట్‌లో నిధుల గురించి ప్రస్తావన లేకపోవడం జిల్లా రైతులకు తీవ్ర నిరాశ కలిగించిందని అన్నారు. దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ జిల్లా బీజేపీ నాయకులు, ఎంపీ, ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలన్నారు. ఎంపీగా గెలిపించిన జిల్లా ప్రజలకు వారు చేసింది గుండు సున్నా అని అన్నారు. ప్రజలు, రైతులు తిరుగుబాటు చేయకముందే జిల్లా అభివృద్ధికి, పసుపు బోర్డు ఏర్పాటుకు తగిన నిధులు మంజూరు చేసే విధంగా బీజేపీ అగ్ర నాయకత్వం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు, లేకుంటే రాబోయే రోజుల్లో బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

27న భూ సదస్సును జయప్రదం చేయండి

- బిఎల్ఎఫ్ జిల్లా కన్వీనర్ సబ్బని లత

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల పట్టాలు, ధరణి, ఇతర భూ సమస్యల పరిష్కారం కోరుతూ భూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బిఎల్ఎఫ్ జిల్లా కన్వీనర్ సబ్బని లత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో జరిగే భూ సదస్సుకు ముఖ్యఅతిథిగా జస్టిస్ చంద్రకుమార్, వక్తలుగా బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్, రాష్ట్ర నాయకులు ఎస్.సిద్ది రాములు, నూనె వెంకటస్వామి పాల్గొంటారని తెలిపారు. భూ సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైతు బీమా కోసం దరఖాస్తుల ఆహ్వానం

- ఏవో, ఏఈఓ

నవతెలంగాణ-మోపాల్

ఇంతవరకు బీమా చేసుకొని రైతులు అలాగే కొత్తగా పట్ట మార్పిడి చేసుకున్న రైతులు, రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి హీరా, ఏఈఓ చక్రపాణి ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుతో పాటు రైతు పట్టాదారు పాస్‌బుక్ లేదా తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన డిఎస్ పేపర్, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జతచేసి క్లస్టర్ ఏఈఓలకు అందజేయాలని తెలిపారు. దరఖాస్తులకు తుది గడువు ఆగస్టు 5వరకు ఉందని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న రైతులు మాత్రమే రైతు బీమాకు అర్హులని పేర్కొన్నారు. గతంలో రైతు బీమా చేసుకున్న రైతులు బీమాలో మార్పులు చేర్పుల కోసం ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎటువంటి రుసుము లేకుండా రైతులకు ఐదు లక్షల రూపాయల బీమా ప్రభుత్వం కల్పిస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు ఉపయోగించుకోవాలని కోరారు.

నమూనా కోర్టు పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ లోని న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బి చివరి సంవత్సర విద్యార్థులకు గురువారం మూట్ (నమూనా) కోర్టు పరీక్షలు నిర్వహించినట్లు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్ డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా తెలిపారు. ఈ పరీక్షలకు ఎక్స్టర్నల్ ఎగ్జామినర్‌గా నిజామాబాద్ సీనియర్ న్యాయవాది జే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ మూట్ కోర్టు పరీక్షలో భాగంగా విద్యార్థులకు రాష్ట్రంలో పార్టీల మార్పిడి వ్యవహారాలపై కేసును రూపొందించి విద్యార్థులకు భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్ట్ ముందు వాజ్యం దాఖలైన సందర్భంలో స్పీకర్‌కు గల హక్కులు, విచక్షణ అధికారాలపై న్యాయ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో న్యాయ శాస్త్ర కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతి డాక్టర్ కె ప్రసన్న రాణి, డాక్టర్ బి. స్రవంతి డాక్టర్ ఎం.నాగజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కను నాటిన ప్రియాంక ధర్మపురి

- కార్గిల్ అమరుల స్మృతిలో..


మొక్కను నాటుతున్న ప్రియాంక ధర్మపురి

నవతెలంగాణ- నిజామాబాద్‌రూరల్

25 వ 'కార్గిల్ విజయ్ దివస్' సందర్భంగా జమ్మూ, కాశ్మీర్ స్టడీ సర్కిల్ వారి ఆధ్వర్యంలో సిఎంఆర్ సెంట్రల్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్ భార్య ప్రియాంక ధర్మపురి పాల్గొన్నారు. అమరవీరుల స్మృతిలో మొక్కను నాటారు. అనంతరం కార్గిల్ అమర వీరుల కుటుంబ సభ్యులసన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ పూర్వ సిఎస్, ఎల్‌వి సుబ్రహ్మణ్యం, ఎయిర్ కమాండర్ వివిఎమ్ రెడ్డి, బిజెపి తమిళ్ నాడు అధ్యక్షులు అన్నామలై కుప్పుస్వామి, ప్రముఖ సినిమా ఆటో గ్రఫీ ఫేర్ సెంథిల్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

రైతు బజార్లో షెడ్ల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని రైతు బజార్ లో సుమారు 30 లక్షలతో రెండు షెడ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం చైర్‌పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు వైస్ చైర్మన్ షేక్ మున్న కౌన్సిలర్ ఆకుల రాము, లిక్కి శంకర్, వనం శేఖర్, సర్వ సమాజ్ అధ్యక్షులు ఆకుల రాజు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ


విదార్థులకు క్రీడా దుస్తులు అందజేసిన ఆనంద్

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని మోతే జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలకు గ్రామంలోని పూర్వ విద్యార్థి శృంగారం ఆనంద్ విద్యార్థులకు పదివేల రూపాయల విలువగల 30 క్రీడా దుస్తులను గురువారం తన తల్లి శృంగారం గంగు చేత విద్యార్థులకు అందజేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాల అంటే తనకు ఎంతో గౌరవమని, విద్యార్థులు మంచి క్రీడాకారులుగా తయారు కావాలని ఉద్దేశంతో దుస్తులను వితరణ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గణేష్ , రత్నయ్య కవిత వ్యాయామ ఉపాధ్యాయులు మంచిర్యాల సురేష్ కుమార్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రామన్నపేట గ్రామంలో అంగన్వాడి భవనం ప్రారంభం..

మండలంలోని రామన్నపేట గ్రామంలో గురువారం డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్ బి అంగన్వాడి భవనం కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమెన్ కమిషన్ మెంబర్ సుధం లక్ష్మి సిడిపిఓ స్వర్ణలత ,సూపర్వైజర్ నీరజ ఎంపీడీవో, అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

శానిటేషన్ పనులు పరిశీలన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో శానిటేషన్ వర్క్‌ను ఎంపీఓ యూసుఫ్ ఖాన్ గురువారం పర్యవేక్షించారు. సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామంలో తాగు జాగ్రత్తలు తీసుకునేలా సూచనలు ఇచ్చారు. గ్రామంలోని వాటర్ ట్యాంకులు, డ్రైనేజీలను, పిచ్చిముక్కల తొలగింపు పనులు పరిశీలించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | జులై 26, 2024 | www.navatelangana.com

రోగులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని మామిడిపల్లి గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు గత 5 రోజులుగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. గురువారం వైద్య పరీక్షలు నిర్వహించి 150 మందిని పరీక్షించి, 41 మందికి రక్త పరీక్షలు చేశారు. ఆశా కార్యకర్తలు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది అందరూ కలిసి ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రత, వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలని అన్నారు. కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ ప్రకాష్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి ప్రవీణ్ రెడ్డి, సరిత,భాగ్యలక్ష్మి,సుజాత, శ్రీలేఖ, పద్మావతి, శ్రీలత పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

నగరంలో చోరీ

13 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మూడవ టౌన్ పరిధిలోని తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగిందని నిజామాబాద్ నగర సీఐ నరహరి తెలిపారు. నగర సిఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని హమాల్ వాడిలో నివాసం ఉంటున్న పెంటయ్య ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో బయటకు వెళ్ళాడు. బుధవారం అర్ధరాత్రి దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో వున్న 13 తులాల బంగారు ఆభరణాలు దొంగలించారు. ఉదయం గుర్తించిన కుటుంబ సభ్యులు మూడవ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని చోరీ జరిగిన తీరును నగర సిఐ నరహరి, మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. సభ్యుల నుండి ఫిర్యాదులు సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయన సేవలు మరువలేనివి

- **బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం**

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో వారికి గురువారం శాలువా కప్పి ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. గత తొమ్మిది సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యాబోధన చేసిన ప్రధానోపాధ్యాయులు మార బాల్‌రెడ్డి, ప్రమోషన్‌పై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాంధారికి, బదిలీలపై వేరువేరు పాఠశాలలకు వెళుతున్న ఉపాధ్యాయులు లక్ష్మినారాయణ, శ్రీనివాస్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫణికుమార్, మాజీ సర్పంచ్ అనిల్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లావణ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చిన ఫణి కుమార్‌కు స్వాగతం పలికారు.



ఉపాధ్యాయులను సన్మానించిన తోటి ఉపాధ్యాయులు

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తమకు పాఠశాలతో, విద్యార్థులతో, ఉపాధ్యాయులతో, గ్రామస్తులతో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. బదిలీలు అనేవి సహజమని కానీ విద్యార్థి, ఉపాధ్యాయుల బంధం శాశ్వతంగా కొనసాగుతుందని అన్నారు. మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులతో తోటి ఉపాధ్యాయులతో మంచి పేరు తెచ్చుకున్న బాల్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని, కష్టపడే తత్వం ఉన్నందున్న ఆయనను విద్యార్థులు జీవితాంతం మర్చిపోరని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫణికుమార్, మాజీ సర్పంచ్ అనిల్‌రెడ్డి, ఆమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లావణ్య, బాల్ రెడ్డి, లక్ష్మినారాయణ, శ్రీనివాస్, లావణ్య, సుమలత, అంజయ్య, చోటిటీ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయడమే ఉపాధ్యాయుల లక్ష్యం


ప్రధానోపాధ్యాయులు రమేష్

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలబాలికల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీయడమే ఉపాధ్యాయుల లక్ష్యమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ అన్నారు. మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణ సప్తహ ఏడవ రోజు కార్యక్రమంలో భాగంగా గురువారానికి నాలుగు రోజులకు చేరుకుంది. పాఠశాల బాలబాలికలు సాంస్కృతి కార్యక్రమాలతో పాటు, ఆటపాటలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత, సాయిలు, స్రవంతి, సురేందర్‌గౌడ్, రాజేశ్వర్, భూషణ్, రాజేశ్వరి, జయలక్ష్మి, గంగారాం, శివానందం, పిఆర్‌పి సుమలత పాఠశాల బాలబాలికలు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలు అదృష్టమైనట్లు నిజామాబాద్ నగర సిఐ నరహరి గురువారం తెలిపారు. నిజామాబాద్ నగరంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో 85 సంవత్సరాల కోనేరు లక్ష్మి మే 30న మధ్యాహ్నం నుండి కనబడడం లేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామన్నారు. వృద్ధురాలికి కళ్ళ సరిగా కనబడవని ఫిర్యాదులో పేర్కొన్నారు. వృద్ధురాలు ఎక్కడైనా కనబడితే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ఐ లేదా నగర సీఐ 8712659836 నెంబర్ క సమాచారం అందించాలన్నారు.

'మీ మరిది చనిపోయాడంటూ' వచ్చి చోరీ

- **అర్ధరాత్రి వచ్చిన దుండగులు**
- **రెండు తులాల బంగారం అపహరణ**

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని నారాయణపేట గ్రామానికి చెందిన ఒక మహిళకు మీ మరిది చనిపోయాడని చెప్పి అర్ధరాత్రి రెండు తులాల బంగారం దోపిడీ చేశారని ఎస్ఐ తిరుపతి గురువారం తెలిపారు. మండలంలోని నారాయణపేట గ్రామానికి చెందిన జాన్కంపేట్ లక్ష్మి బుధవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉంది. రాత్రి సుమారు 12:20 గంటల సమయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంటికి వచ్చారు. మీ మరిది చనిపోయారని చెప్పగా ఆమె తలుపు తెరిచింది. దీంతో వారు కత్తి చూపించి అరుస్తే చంపేస్తామని బెదిరించారు. ఆ పైన బీరువాలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడు, కొంత నగదును ఎత్తుకుని వెళ్లిపోయారు. కాగా లక్ష్మి కొడుకు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నారాయణపేట గ్రామాన్ని డిచ్పల్లి సిఐ మల్లేష్ సందర్శించి వివరాలు అడిగి కేసు దర్యాప్తు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. ఎవరైనా రాత్రి సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే 100/8712659853(ఎస్సై జక్రాన్‌పల్లి)కి తెలపాలని అన్నారు.

కోటగిరిలో మూడున్నర సెంటిమీటర్ల వర్షపాతం

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో మూడున్నర సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు ఏఎస్ఓ రమేష్ తెలిపారు. 13 పాక్షికంగా ఇల్లు కూలిపోయినట్లు ఆర్ఐ సయ్యద్ పేర్కొన్నారు. ఎటువంటి ప్రాణహాని జరగలేదని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే ఇంట్లో నుంచి బయటకు రావాలని ఆయన పేర్కొన్నారు.

కౌలాస్‌నాలా ప్రాజెక్ట్‌కు 521 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కౌలాస్‌నాలా ప్రాజెక్టుకు గురువారం ఉదయం 6 సమయం నాటికి ఎగువ నుంచి 521 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని ప్రాజెక్ట్ ఏఈ రవిశంకర్ గురువారం తెలిపారు. ప్రస్తుతం ముసురు వాన కురుస్తుండటంతో తెలంగాణ, ఎగువన మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దులలో సమృద్ధిగా వర్షాలు పడుతున్నాయని గంటగంటకు నీరు వస్తుంటుందని ఆశాభావం వ్యక్త చేశారు. ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లకు గాను 454.74 మీటర్లు నీటి మట్టం ఉందని పేర్కొన్నారు.

జుక్కల్‌లో 17.8 మీల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలో 17.8 మీ.మీ వర్షపాతం నమోదైందని ఎంఆర్ఐ రామ్ పటేల్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో పాత ఇండ్లలో నివాసం ఉండే వారు, ఇంటిన మార్చుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని, పాత గోడలు, ఇండ్లు వర్షం దాటికి నాని కూలి పోతే ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు.

గురమ్మకు ఘనంగా దహన సంస్కారాలు

నవతెలంగాణ-రెంజల్

1976 సంవత్సరంలో ఎక్కడి నుంచో వచ్చిన గురమ్మ రెంజల్ మండలం కూనేపల్లి గ్రామ శివాలయంలో గత 38 సంవత్సరాలుగా శివుడికి పూజలు అందిస్తోంది. కాగా ఆమె అనారోగ్యంతో మృతి చెందగా గ్రామస్తులంతా కలిసి ఆమె దహన సంస్కారాలకు గురువారం నిర్వహించారు.

కూలిన ఇల్లును పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని లచ్చన్ గ్రామంలో ముసురు వర్షానికి కూలిన ఇంటిని మండల తహసీల్దార్ ఎండి ముజీబ్ పరిశీలించారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి లచ్చన్ గ్రామంలో ఇల్లు కూలిపోయింది. దానిని పరిశీలిస్తూ తహసీల్దార్ ప్రభుత్వ పరంగా నిర్వాసితులకు ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇల్లు లేనందున డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయించాలని కూలిపోయిన ఇంటి నిర్వాసితులు తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్ వెంట కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

ఇది బడా కార్పొరేట్ల బడ్జెట్

- **సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు**

నవతెలంగాణ-మాక్లూర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ బడ్జేటేనని రైతు, కార్మిక, పేద ప్రజల శ్రేయస్సు కోరే బడ్జెట్ కాదనీ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు అన్నారు. గురువారం మండలంలోని బోర్గం (కే) గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేషెట్టి సాయిరెడ్డి, మండల కార్యదర్శి కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ తెలంగాణ దశాదిశను మారుస్తుంది

- **మానాల మోహన్ రెడ్డి**

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో అన్ని రంగాలను సమన్వయ పరుస్తూ అన్ని రంగాలకు నిధులు కేటాయించారు. వ్యవసాయ రంగం దాని అనుబంధ రంగాలను ప్రాధాన్యం చేస్తూ సుమారు 72 వేల కోట్లు ప్రభుత్వం కేటాయించింది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రంగాలకు గతం కంటే ఎక్కువ నిధులు కేటాయించడం ద్వారా ఈ ప్రభుత్వం సమసమాజ స్థాపనకు కృషి చేస్తుందని తెలుస్తుంది.

నగర అభివృద్ధికి పది కోట్లు కేటాయించడం అభినందనీయం

- **కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు కేశ వేణు**

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10 కోట్లను ప్రకటించారు. అందులో భాగంగా ఈ రోజున నగరంలోని అన్ని ప్రాంతాలలో రోడ్లు బాగు చేయడం, కొత్తగా డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించడంకోసం సుమారు 6.25 కోట్లు అలాగే విద్యార్థులకోసం ప్రభుత్వ స్కూల్, కాలేజీల్లో అదనపు తరగతులు, మరుగుదొడ్ల నిర్మాణాల కోసం సుమారు 1.30 కోట్లు అందజేశారు. అన్ని కలిపి సుమారు రూ.7.55 కోట్లు మంజూరు చేశారు. మిగిలిన వాటిని నగరంలోని మంచినీటి వ్యవస్థ కోసం కేటాయించారు.

పారిశుధ్య పనులు పరిశీలన

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని భిక్కనూర్, తిప్పాపూర్, మోటాటిపల్లి గ్రామాలలో పారిశుధ్య పనులను ఎంపీఓ రాజ్‌కిరణ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. గ్రామాలలో ఎక్కడ కూడా చెత్తాచెదారం లేకుండా చూడాలని, నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. అలాగే మొటాటిపల్లి గ్రామంలో వర్షాకాలం కారణంగా కూలిపోతున్న ఇంట్లో నివసిస్తున్న వారిని మరోచోట నివాసాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై డిపిఓకు ఫిర్యాదు చేసిన గురడి రెడ్డి సంఘ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలం దేగాం గ్రామంలో గురడిరెడ్డి సంఘం వెనుక గ్రామపంచాయతీకి చెందిన స్థలాన్ని దొడ్డ సత్యం అనే వ్యక్తి ఆక్రమించి నిర్మాణం చేశాడని గురడి రెడ్డి సంఘం సభ్యులు జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ)కి ఫిర్యాదు చేశారు. దేగాం గురడిరెడ్డి సంఘం సభ్యులు గురువారం జిల్లా కేంద్రంలోని డిపిఓ కార్యాలయానికి తరలి వెళ్లారు. సంఘం వెనుకనున్న జిపి స్థలాన్ని ఆక్రమించుకొని సత్యం 2021 జనవరిలో అక్రమ నిర్మాణం చేశాడన్నారు. ఈ స్థలం గుండా కాలనీవాసులు వెళ్లే దారి కాబట్టి సంఘ సభ్యులు, కాలనీవాసులు అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ ఫిర్యాదు మేరకు ఎంపిఓ, డిఎల్‌పిఓలు సందర్శించి జిపి స్థలాన్ని ఆక్రమించినందున 2021 జనవరి 9వ తేదీన తొలగించాలని గ్రామ కార్యదర్శికి ఆదేశించారన్నారు. అధికారుల ఆదేశాల మేరకు గతంలో అక్రమ కట్టడాన్ని తొలగించారన్నారు. తిరిగి సత్యం జిపికి చెందిన స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మాణం చేశాడని చెప్పారు. ఈ అక్రమ నిర్మాణం వలన కాలనీవాసులకు, తమకు ఇబ్బందులు కలుగుతున్నందున పరిశీలించి అక్రమ కట్టడానికి తొలగించాలని వారు డిపిఓకు కోరారు.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 27న స్పాట్ అడ్మిషన్లు ఉన్నాయని ఎల్లారెడ్డి గురుకుల పాఠశాల కళాశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు పొందేందుకు శనివారం కామారెడ్డి జిల్లా భిక్కనూరు గురుకుల పాఠశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు 2024లో ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. ఎల్లారెడ్డి కళాశాలలో వివిధ గ్రూపులలో 21 సీట్లు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు కౌన్సిలింగ్ కేంద్రానికి వెళ్లి అడ్మిషన్లు పొందాలని సూచించారు.

బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ఉత్నూర్ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్‌ను యాచారం మాజీ సర్పంచ్ లత రమేష్ గురువారం ఆయన శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. రైతు రుణాలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నారని తెలిపారు. కొత్త రుణాలు కూడా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మేనేజర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బానోత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాల రక్షాభవన్‌లో బాలుడు

నవతెలంగాణ-కామారెడ్డి



వినికిడి లోపం, మాట్లాడలేకపోతున్న బాలుడు కామారెడ్డి బల రక్షాభవన్‌లో ఉన్నాడని, అతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే బాలునికి సంబంధించిన పూర్తి ఆధారాలతో బాల రక్షాబవన్‌ను సంప్రదించి బాలున్ని తీసుకెళ్లాలని జిల్లా మహిళా, పిల్లల, వికలాంగుల, వయవృద్ధుల శాఖ జిల్లా అధికారి గురువారం తెలిపారు. బాలుడు ఈ నెల 17న రాత్రి 11:30 గంటలకు కొత్త బస్టాండ్ సమీపంలో పండ్ల దుకాణం వద్ద ఉన్నట్లు 1098 చైల్డ్ హెల్ప్ లైన్ కామారెడ్డికి సమాచారం రాగా తాము వెళ్లి పరిశీలించగా అబ్బాయికి వినికిడి లోపం ఉన్నట్లు, మాట్లాడలేకపోతున్నాడని గ్రహించి జిల్లా కేంద్రంలోని జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి చెందిన కార్యాలయానికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. ఇప్పటివరకు ఆ బాలుడు ఎలాంటి వివరాలు చెప్పడం లేదని, ఇతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే బాలుని పూర్తి ఆధారాలతో బాల రక్షాభవన్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

బోనాల ఉత్సవాలకు రావాలని బిత్తిరి సత్తికి ఆహ్వానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఈ నెల 28న పట్టణ కేంద్రంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో జరిగే బోనాల ఉత్సవానికి రావాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, బిత్తిరి సత్తికి హైదరాబాద్ వెళ్లి ఆహ్వాన పత్రిక అందించినట్టు మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా బోనాల ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా ఫలహారం బండి ఊరేగింపు నిర్వహిస్తున్నామని, దీనికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, బిత్తిరిసత్తి హాజరవుతారని తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త తొలగింపు

- **ఎంపీఓ మలహరి**

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ గ్రామపంచాయతీ పరిధిలో గురువారం రోడ్లపై ఉన్న చెత్తను తొలగించినట్లు ఎంపీఓ మలహరి అన్నారు. మేజర్ గ్రామపంచాయతీలో పారిశుధ్యం లోపించకుండా రోడ్లపై వేసిన చెత్తచెదారాన్ని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల సహకారంతో చెత్తను ట్రాక్టర్‌లో వేసి డంపింగ్ యార్డ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లకు ఇరువైపులా మురికి కాలువలపైన దోమల మందులు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పారిశుధ్యం లోపించకుండా రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. వ్యాపార సముదాయాలు ప్రజలు రోడ్లపై చెత్త వేయవద్దని, రోజువారీ చెత్త టాక్టర్లు వేయాలని ఆయన సూచించారు. రోడ్లపై వ్యర్థ పదార్థాలు వేయరాదన్నారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

ఎంపీవోగా రాము బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-జుక్కల్

మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీవోగా రాము బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీవో రాము మాట్లాడుతూ.. నసురుల్లాబాద్ ఎంపీవోగా విధులు నిర్వహించి, బదిలీల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయానికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయుల నిరసన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు బదిలీలు చేయాలని కోరుతూ గురువారం ప్లకార్డులు పట్టి నిరసన వ్యక్తం చేశారు. గత 11 సంవత్సరాలుగా ఒకే చోట ఉద్యోగం చేస్తున్నామని పాఠశాల ప్రారంభం నాటి నుంచి ఇక్కడే పని చేస్తున్నామని తమకు బదిలీలు చేయాలని కోరుతూ షార్ట్‌టైంలో నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపి తమ సమస్య పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

నేడు పోచారం రాక

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి మండల కేంద్రంలోని ఏఎస్ ఫంక్షన్‌హాల్‌లో రెండు పడక గదుల బిల్లుల మంజూరు బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేస్తు న్నట్లు కోటగిరి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు షాహిద్ హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజు హాజరవు తున్నట్లు పేర్కొన్నారు.

విద్యారంగ ప్రాధాన్యతను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్

డాక్టర్ ఏ పున్నయ్య టీయూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తామని, తగిన నిధులు ఇచ్చి విద్యారంగంలో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ బడ్జెట్ లో కేవలం మొత్తం విద్యారంగానికి 7.31శాతం నిధులు కేటాయించడం తీవ్ర నిరాశను కలిగించింది. ఉన్నత విద్యారంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం గత కొంతకాలంగా మేధావులు, విద్యావేత్తలు, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20శాతం తగ్గకుండా నిధులు కేటాయించాలని పదే పదే కోరుతున్నప్పటికీ పట్టించుకోలేదు. విద్యా రంగానికి తగినన్ని నిధులు కేటాయించకుండా విద్యాసంస్థల్లో నాణ్యమైన సమానమైన విద్య అందించడం సాధ్యం కాదు. ఈ ప్రభుత్వం దశాబ్దాలుగా విద్యారంగానికి జరుగుతున్న అన్యాయాన్ని పట్టించుకోకపోవడం ద్వారా పేదలకు,బలహీనవర్గాలకు ఉద్దేశ్యపూర్వకంగా అన్యాయం చేసినట్లే అవుతుంది. గత పాలకుల్లా ప్రభుత్వం కూడా విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం.